సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 20 । జూన్ । 2025



ఆచార్యుడికి ఫెలోషిప్

ఏయూ కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు సాంబశివరావు ఐసీఎస్ఎస్ఆర్ సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు.




ఘనంగా పంచామృతాభిషేకం

విశాఖ: బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో త్రికాల పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు. IIలో

లాసెట్‌లో 'టాప్' లేపారు



అనకాపల్లికి చెందిన వేముల వెంకట శివసాయి భార్గవి లాసెట్ (జీఎల్ మూడేళ్ల కోర్సు)లో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. 2, 4 ర్యాంకులు కూడా ఉమ్మడి విశాఖ జిల్లా వారికే దక్కాయి. IIలో





ఎస్.రాయవరం మండలంలోని పెద్దగుమ్మలూరులో హైవేకు సమీపంలో నడుపుతున్న వైన్ షాపు



స్వయంగా మీరే హాజరు కండి!

హోం మంత్రి వంగలపూడి అనిత ప్రాతినిథ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలో జాతీయ రహదారికి అతి సమీపంలో లిక్కర్ షాపు ఏర్పాటుపై ఎక్సైజ్ పోలీసులకు లోకాయుక్త షాక్ ఇచ్చింది. ఈ వ్యవహారంలో స్వయంగా వచ్చి తమ ముందు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేసింది.

అనకాపల్లి ఎక్సైజ్ అధికారులకు లోకాయుక్త ఆదేశం

హోం మంత్రి నియోజకవర్గంలో లిక్కర్‌షాపు ఏర్పాటుపై షాక్

జాతీయ రహదారి పక్కనే అనుమతి ఇచ్చిన అధికారులు

- ఫిర్యాదు వచ్చినా నోటీసుల పేరుతో కాలయాపన
- కోర్టుకెళ్లి స్టే తెచ్చుకునే వరకు దాటవేత
- చివరకు స్టే వచ్చిందంటూ కనీసం కన్నెత్తి చూడని వైనం
- లోకాయుక్తను ఆశ్రయించడంతో తాజాగా నోటీసుల జారీ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎస్.రాయవరం మండలంలోని పెద్దగుమ్మలూరు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఏఆర్‌కే వైన్స్ జాతీయ రహదారికి కేవలం 140 మీటర్ల దూరంలోనే ఉంది. అయినా ఈ షాపు ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు అనుమతినిచ్చారు. జాతీయ రహదారికి 220 మీటర్ల అవతల మాత్రమే లిక్కరు షాపు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టంగా తన తీర్పులో పేర్కొంది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా అనుమతినిచ్చారు. దీనిపై పలు దఫాలుగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎక్సైజ్ అధికారులు కాలయాపన చేస్తూ వస్తున్నారు. నోటీసుల పేరుతో తాత్సారం చేసి... చివరకు స్టే వచ్చిందంటూ అటువైపుగా వెళ్లకుండా, చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారు. దీంతో లోకాయుక్తను కొద్దిమంది ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు ఆగస్టు 6వ తేదీన స్వయంగా తమ వద్ద హాజరు కావాలంటూ లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది. చాలా తక్కువ కేసుల్లో మాత్రమే స్వయంగా హాజరు కావాలనే ఆదేశాలను లోకాయుక్త జారీ చేస్తుందని తెలుస్తోంది. స్వయంగా హోం మంత్రి నియోజకవర్గంలోనే నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతూ... ఇష్టారీతిలో లిక్కర్ అమ్మకాలు కొనసాగుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విచారణ పేరుతో కాలయాపన...!

వాస్తవానికి జాతీయ రహదారికి అతి సమీపంలో షాపు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చిందే ఎక్సైజ్ అధికారులు. స్వయంగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) వచ్చి మరీ అనుమతులు మంజూరు చేసినట్టు తెలుస్తోంది. దీనిపై స్థానికంగా వ్యతిరేకత రావడంతోపాటు సుప్రీంకోర్టు విధించిన నిబంధనలకు విరుద్ధంగా అనుమతి ఎలా ఇచ్చారంటూ కొందరు నేరుగా ఎక్సైజ్ అధికారులకు జనవరి నెలలోనే ఫిర్యాదు చేశారు. అయితే, తామే అనుమతి ఇచ్చినందున ఎక్సైజ్ అధికారులు... పట్టించుకోకుండా ఉండిపోయారు. దీంతో నేరుగా సీఎం గ్రీవెన్స్ సెల్‌తోపాటు మంత్రి లోకేష్ గ్రీవెన్స్ సెల్‌కు వెళ్లి మరీ ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఈ ఫిర్యాదుపై విచారణ పేరుతో కాలయాపన చేశారు. అనంతరం అనకాపల్లి ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో నోటీసులు ఇస్తున్నట్లు అనకాపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ బదులిచ్చారు. వారికి తీరిగ్గా నోటీసులు ఇచ్చి... హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేందుకు అవకాశం ఇచ్చారనే విమర్శలున్నాయి. అనుమతి ఇచ్చిన ఎక్సైజ్ అధికారులే ఇప్పుడు నోటీసులు ఇచ్చారంటూ వాదించి హైకోర్టు నుంచి స్టే తెచ్చుకునేందుకు పరోక్షంగా దోహదం చేశారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ఫిర్యాదుదారు గుర్రం నానాజీ లోకాయుక్తను ఆశ్రయించారు. జాతీయ రహదారికి అతి సమీపంలో ఏకంగా వైన్ షాపు ఏర్పాటు చేసిన వైనం... ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకుండా తాత్సారం చేసిన తీరుపై లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. దీంతో ఏకంగా వ్యక్తిగతంగా తమ ముందు హాజరు కావాలంటూ నోటీసులు జారీ అయినట్టు సమాచారం.

మామూళ్లు ఇచ్చి ఏమైనా చేసుకోండి..!

అనకాపల్లి జిల్లాలో పాయకరావుపేటతోపాటు యలమంచిలి నియోజకవర్గంలో లిక్కర్ సిండికేట్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలున్నాయి. తాము ఏమీ చేసినా అటు ఎక్సైజ్ అధికారులు కానీ... ఇటు పోలీసు సిబ్బంది కానీ ఏమీ చేయరనే ధీమాతో లిక్కర్ సిండికేట్ ఉందనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే సంక్రాంతి సందర్భంగా రెండు నియోజకవర్గాల్లోనూ కోడిపందెలతోపాటు బహిరంగంగా మద్యం విక్రయాలు జరిగాయి. అంతేకాకుండా పేకాట శిబిరాలను కూడా నిర్వహించారు. ఈ ధైర్యంతోనే రెండు నియోజకవర్గాల్లోనూ లిక్కర్ షాపు యాజమాన్యాలు ఇష్టారీతిలో వ్యవహరిస్తున్నాయనే విమర్శలున్నాయి. బెల్టు షాపులను కూడా భారీ సంఖ్యలో నిర్వహిస్తున్నారు. ఇక నేరుగా వైన్ షాపుల్లోనే అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారు. బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో మరింతగా రెచ్చిపోతున్నారు. అంతేకాకుండా ఎక్సైజ్ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి నేరుగా ఏయే షాపు నెలవారీగా ఎంత మొత్తం ఇవ్వాలో పేర్కొంటూ కొద్దిరోజుల క్రితం సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలుస్తోంది. అటు ఎక్సైజ్, ఇటు పోలీసు సిబ్బంది నెలవారీగా దండుకుంటూ చూసీచూడనట్టు మొత్తం వ్యవహారాలను నడుపుతున్నారనే ఆరోపణలున్నాయి. తాజాగా లోకాయుక్త నోటీసులతోనైనా వీరి వ్యవహారం మారుతుందా? లేదా అనేది చూడాల్సి ఉంది.

'సికిల్ సెల్'పై పోరాటం



సికిల్ సెల్ ఎనీమియా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో బాలాజీ తదితరులు

- ఏజెన్సీవాసులకు వచ్చే జన్యుపరమైన ఎనీమియా వ్యాధి
- జన్మతః 10 శాతం మందికి సంక్రమించే అవకాశం
- సికిల్ సెల్ ఎనీమియా డే సందర్భంగా అవగాహన కార్యక్రమాలు

సాక్షి, అనకాపల్లి: సికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా.. ఈ వ్యాధులు గిరిజనుల పాలిట శాపాలు. వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి సంక్రమించే ఈ రక్తహీనత రుగ్మతలు 10 శాతం మంది ప్రాణాలను హరిస్తున్నాయి. జిల్లాలోని నాతవరం, గొలుగొండ, రోలుగుంట, రావికమతం, కోటవురట్ల, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు మండలాల్లో గిరిజన గ్రామాలున్నాయి. ఈ ప్రాంతాల్లో విస్తృత అవగాహన కల్పించడానికి, ప్రాథమిక పరీక్షలు జరిపి అవసరమైన వారికి వ్యాధి నిరోధక చికిత్స అందించడానికి వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద జిల్లా మలేరియా అధికారి వరహాలదొర, డాక్టర్ శ్రావణి, డాక్టర్ ధాత్రి ప్రియతో కలిసి డీఎంహెచ్‌వో బాలాజీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. జూలై 3వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా విరివిగా ప్రాథమిక రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఎం.ఎ స్.వి.కె.బాలాజీ మాట్లాడుతూ.. 2047 నాటికి జిల్లాలోని గిరిజన గ్రామాల్లో సికిల్ సెల్ వ్యాధి సమూలంగా రూపుమాపడమే తమ లక్ష్యమని చెప్పారు. దీర్ఘకాలం కామెర్లు ఉండడం, రక్తహీనతతో శరీరం పాలిపోయి ఉండటం, కాళ్లు, చేతుల వేళ్ల వాపుతో వంపు తిరిగి ఉండటం ఈ వ్యాధి ప్రధాన లక్షణాలన్నారు.

ప్రజాసంకల్పయాత్రతో మలుపు

2018లో అప్పటి ప్రతిపక్షనేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో ఏజెన్సీ ప్రాంతవాసులు సికిల్ సెల్ ఎనీమియా గురించి విన్నవించుకున్నారు. ఆనాడు వారికి ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పింఛను సౌకర్యం తొలిసారిగా కల్పించింది. ఆంధ్ర మెడికల్ కళాశాలలో పెథాలజీ విభాగంలో తలసేమియా స్క్రీనింగ్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. దాదాపు రూ.20 లక్షలు విలువైన హెచ్‌పీఎల్‌సీ పరికరాలను ఏర్పాటు చేశారు. పెథాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ సంయుక్తంగా ఈ ప్రాజెక్టును నిర్వహిస్తున్నాయి. దీని ద్వారా నేరుగా గిరిజన చిన్నారులకు హిమోగ్లోబిన్ పాథసిస్ స్క్రీనింగ్‌లు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు.

అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రాథమిక పరీక్షలు

జిల్లాలో మొత్తం 34,849 మంది గిరిజన జనాభా ఉండగా ఇటీవల 4,290 మంది అనుమానితులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వారిలో 57 మందిలో సికిల్ సెల్ ట్రేట్, 11 మందిలో సికిల్ సెల్ డిసీజ్ గుర్తించారు. ఈ వ్యాధులను ప్రాథమికంగా గుర్తించేందుకు 'సికిలింగ్', 'హెచ్‌బీ ఎస్టిమేషన్' పరీక్షలను అన్ని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులలో వైద్యశాఖ నిర్వహిస్తోంది. ఈ రెండు పరీక్షలలో వ్యాధి లక్షణాలున్నట్లు గుర్తిస్తే వాటిని కేజీహెచ్ పెథాలజీ విభాగంలో ఏర్పాటు చేసే తలసేమియా ల్యాబ్‌కి పంపించి పరీక్షలు చేస్తారు. దీంతో తక్కువ సమయంలో ఈ వ్యాధి లక్షణాలు గుర్తించడంతోపాటు వారికి త్వరతగతిన మెరుగైన వైద్యం అందించగలుగుతారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లాకు 6 బహుమతులు

విజేతలను అభినందించిన కలెక్టర్



యోగా పోటీల్లో గెలుపొందిన జిల్లావాసులు

తుమ్మపాల: యోగాంధ్రలో భాగంగా విజయవాడలోని గుంటుపల్లిలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన ఆరుగురు యోగా క్రీడాకారులు బహుమతులు సాధించారు. వీరిని కలెక్టర్ విజయకృష్ణన్ అభినందించారు. 13 విభాగాల్లో మూడు ప్రథమ, రెండు ద్వితీయ, ఒక తృతీయ స్థానాలను సాధించి జిల్లాకు అపూర్వమైన గుర్తింపు తెచ్చారన్నారు. 19 –35 ఏళ్ల విభాగం యోగా స్లోగన్ పోటీలో అలేఖ్య ద్వితీయ స్థానం, యోగా పోస్టర్‌లో తృతీయ స్థానం సాధించింది. 10–18 ఏళ్ల విభాగం యోగా క్విజ్‌లో డి.ప్రియాంక, యోగా పెయింటింగ్‌లో సి.తేజ ప్రథమ స్థానం సాధించారు. యోగా పోస్టర్‌లో పి.భవిత ద్వితీయ స్థానం, 35 సంవత్సరాల పైబడిన సింగర్స్ గ్రూప్ ఈవెంట్‌లో ప్రథమ బహుమతి సాధించారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపించి బహుమతులు పొందిన విజేతలకు గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ బహుమతులను అందించారని జిల్లా క్రీడాల అభివృద్ధి అధికారి ఎల్.వెంకటరమణ తెలిపారు

గవర్నర్‌కు స్వాగతం

మహారాణిపేట (విశాఖ): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గురువారం విశాఖపట్నం చేరుకున్నారు. ఆయనకు విమానాశ్రయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పుష్ప గుచ్ఛాలు అందజేసి.. స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన నోవాటెల్‌కు చేరుకున్నారు. రాత్రికి అక్కడ బస చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నోవాటెల్ నుంచి మహారాణిపేట వెళ్తారు. తిరిగి నోవాటెల్‌కు చేరుకుని సాయంత్రం 5.50 గంటల వరకు అక్కడే ఉంటారు. సాయంత్రం విశాఖ విమానాశ్రయానికి చేరుకుని ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతారు. శనివారం యోగా దినోత్సవంలో పాల్గొంటారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ పీలా

నేడు సీఎం రాక

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం విశాఖ వస్తున్నారు. విశాఖ విమానాశ్రయానికి సాయంత్రం 5.30 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 6.40 గంటలకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతారు. శనివారం ఉదయం 6.30 నుంచి 7.50 గంటల వరకు ప్రధానితో కలిసి యోగా విన్యాసాల్లో పాల్గొంటారు.

ఇంటర్ అడ్మిషన్లకు గడువు ఈనెల 30

అనకాపల్లి: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీలోగా అడిషన్లు పూర్తి చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి బి.సుజాత గురువారం తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ సీట్లు కొన్ని మాత్రమే ఖాళీగా ఉన్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు త్వరపడాలని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల నుంచి మొత్తం 1500 మంది విద్యార్థులు ఈనెల 21న విశాఖ ఆర్కే బీచ్‌లో జరిగే ప్రపంచ యోగా దినోత్సవాల్లో పాల్గొంటారని ఆమె చెప్పారు.

'యోగాంధ్ర'కు ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, అనకాపల్లి: ఈ నెల 21న విశాఖ సాగర తీరంలో ఏర్పాటు చేసిన 'యోగాంధ్ర'కు జిల్లాలో 24 మండలాల నుంచి భారీగా జనం తరలివెళుతున్నారు. విశాఖ, పీఎంపాలెం, పనోరమహిల్స్ లా కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన 37 కంపార్టుమెంట్ల వద్దకు ప్రజలు యోగాంధ్రకు బస్సుల ద్వారా చేరుకోనున్నారు. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చే బస్సులు మండలాల వారీగా మూడు మార్గాల్లో వెళ్లేలా ట్రాఫిక్ నియమాలు దిశానిర్దేశం చేశారు. పాయకరావుపేట నుంచి విశాఖ దిశగా వెళ్లే భారీ వాహనాలను ఈనెల 20 సాయంత్రం 6 గంటల నుంచి నిలిపివేస్తారు. సాధారణ వాహనాలు, అత్యవసర వాహనాలను పాయకరావుపేట నుంచి నేషనల్ హైవే మీదుగా ఆనందపురం వైపు మళ్లిస్తారు.



అత్యవసర వాహనాలకు మాత్రమే ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. కంపెనీలకు చెందిన బస్సులు 20వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి నిలిపివేస్తారు.

రూట్ 1 అనకాపల్లి, వి.మాడుగుల, చీడికాడ, కె.కోటపాడు, చోడవరం, దేవరాపల్లి, బుచ్చెయ్యపేట, రోలుగుంట, రావికమతం, సబ్బవరం మండలాలకు చెందిన బస్సులు..చిన్నయ్యపాలెం జంక్షన్ మీదుగా సబ్బవరం, పెందుర్తి, గండిగుండం, శొంఠ్యాం అండర్ బ్రిడ్జి, అడవివరం, హనుమంతువాక, మధురవాడ లా కాలేజ్, ఐటీ సెజ్ దారిలో వెళతాయి.

రూట్ 2 పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, యలమంచిలి, కశింకోట, మునగపాక, కోటవురట్ల, నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన బస్సులు..నేషనల్ హైవే మీదుగా తాళ్లపాలెం జంక్షన్, కశింకోట జలగ మదుం, సబ్బవరం, పెందుర్తి, గండిగుండం, శొంఠ్యాం అండర్ బ్రిడ్జి, అడవివరం, హనుమంతవాక, లా కాలేజ్ మీదుగా ఐటీ సెజ్ కు చేరుకుంటాయి.

రూట్ 3 రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాలలో గల ఫార్మా పరిశ్రమల కార్మికులు, విద్యార్థుల బస్సులు లంకెలపాలెం, గాజువాక, ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం, సింహాచలం, అడవివరం, హనుమంతువాక, మధురవాడ లా కాలేజ్, ఐటీ సెజ్ కు చేరుకుంటారు.

ట్రాఫిక్ రద్దీ లేకుండా చర్యలు



'యోగాంధ్ర' కార్యక్రమానికి ట్రాఫిక్ రద్దీ లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చే బస్సులన్నింటినీ లా కళాశాల నుంచి ఐటీ సెజ్ వరకూ 37 కంపార్టుమెంట్లలో బస్సుల పార్కింగ్ ఉంటుంది. ప్రజలు సురక్షితంగా చేరేలా.. పార్కింగ్ స్థలాల్లోకి సజావుగా నడిపేందుకు ఇతర శాఖలతో సమన్వయంతో పోలీస్ సిబ్బంది పనిచేసేలా ఆదేశాలు ఇచ్చాం. ట్రాఫిక్ నియంత్రణలో ఎలాంటి అవాంతరాలు లేకుండా అన్ని చర్యలు చేపట్టాం. జిల్లా నుంచి వచ్చే బస్సులతో పాటు ప్రజాప్రతినిధులకు సంబంధించిన 48 బస్సులు కూడా ఈ రూట్లలోనే వస్తాయి. ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

– తుహిన్ సిన్హా, ఎస్పీ, అనకాపల్లి జిల్లా

అధికారులకు..అవస్థల యోగం

- 21న విశాఖలో జరగనున్న యోగాంధ్రకు భారీ జన సమీకరణ
- అనకాపల్లి జిల్లా నుంచి 60 వేల మందిని తరలించాలని లక్ష్యం
- వారితోపాటు ఫార్మా పరిశ్రమలలో పనిచేసే 25 వేల మంది కార్మికులు
- కళాశాలలు, పాఠశాలల నుంచి 27 వేల మంది విద్యార్థులు
- వీరి కోసం 1,200 ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల కేటాయింపు
- ఒక్కో మండలంలో 2400 మందిని సమీకరించే బాధ్యత సచివాలయ ఉద్యోగులకు..
- అనకాపల్లి జిల్లా నుంచి వచ్చే బస్సుల కోసం రెండు రూట్లు కేటాయింపు

సాక్షి, అనకాపల్లి: యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ బీచ్‌రోడ్డులో నిర్వహించే 'యోగాంధ్ర'కు అధికారులకు, ప్రభుత్వ ఉద్యోగులకు తిప్పలు తప్పడం లేదు. ఈ నెల 21వ తేదీన విశాఖలో జరగనున్న 'యోగాంధ్ర'కు భారీ జన సమీకరణ టార్గెట్లు విధించడంతో అధికారులంతా విధులు గాలికొదిలి యోగాసనాలు వేస్తున్నారు. అనకాపల్లి జిల్లా నుంచి 60 వేల మంది సాధారణ జనాన్ని తరలించాలని ఇప్పటికే జిల్లాలో ఉన్న అన్ని విభాగాల అధికారులకు, సచివాలయ సిబ్బందికి టార్గెట్లు విధించారు. వారితో పాటు పరవాడ-రాంబిల్లి-అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న ఫార్మా, ఇతర పరిశ్రమలలో పనిచేసే కార్మికులను సుమారు 25 వేల మందిని పంపాలని ఆయా యాజమాన్యాలకు ఆదేశించారు. ఇక ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల నుంచి 27,215 మంది విద్యార్థులు రావాలని అన్ని కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలకు హుకుం జారీ చేశారు. జిల్లాలో సుమారుగా 1,200 ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ఈ కార్యక్రమానికి కేటాయించారు. ఒక్కో మండలంలో 2400 మంది చొప్పున సాధారణ జన సమీకరణ చేయాలని ఆ బాధ్యత సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు.

నెల రోజులుగా పాలన గాలికి..

3నెల రోజులుగా జిల్లాలో ఉన్న ప్రతి ప్రభుత్వ విభాగంలో జిల్లా స్థాయి అధికారి నుంచి కింది స్థాయి ఉద్యోగి వరకూ అందరూ 'యోగాంధ్ర' పాటే పాడుతున్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి యోగాంధ్ర కార్యక్రమాలు, సమీక్షలు, సర్వేలు, పాల్గొన్న వారికి బహుమతులు, భారీ జనసమీకరణపైనే పనిచేస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల నుంచి జిల్లా స్థాయి అధికారి వరకూ అందరికీ టార్గెట్లు ఇచ్చారు. ఒక వైపు పాఠశాలలు పునఃప్రారంభమై వారం రోజులు దాటింది. పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు, పాఠ్యపుస్తకాల పంపిణీ వంటివి పక్కన పెట్టి నెల రోజులుగా విద్యాశాఖ అంతా 'యోగాంధ్ర' కార్యక్రమంపైనే దృష్టి సారించింది. ఆర్టీసీ బస్సులను యోగాంధ్రకు జన సమీకరణకు పంపించారు. నర్సీపట్నం, అనకాపల్లి డిపోల పరిధిలో బస్సులు ఇందుకోసం వెళ్లిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బంది తప్పలేదు.

సచివాలయ ఉద్యోగులపై తీవ్ర పని ఒత్తిడి..

గ్రామాల వారీగా ప్రజా సంక్షేమ సమస్యలు పరిష్కరించేది సచివాలయ ఉద్యోగులే. అలాంటి గ్రామ సచివాలయ ఉద్యోగులకు రోజంతా విశ్రాంతి లేకుండా తీవ్ర పని ఒత్తిడి గురవుతున్నారు. 'యోగాంధ్ర' కార్యక్రమానికి జనసమీకరణ చేయాలని టార్గెట్లు విధించారు. ఒక వైపు జనాన్ని సమీకరించాలి.. మరో వైపు ఇటీవల తల్లికి వందనం లబ్ధి అందని విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేయించాలి. మరోవైపు 'అన్నదాత సుఖీభవ' అర్హులకు ఈకేవైసీ చేయాలి. యోగాంధ్రకు జనం తరలింపు వంటి టార్గెట్‌లతో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ విరామం లేకుండా లేకుండా పనిచేస్తున్నారు.



ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి పల్లె వెలుగు బస్సులో కలెక్టర్ విజయ కృష్ణన్ ట్రయల్ రన్

యోగాంధ్ర ట్రయల్ రన్

పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన కలెక్టర్, ప్రజాప్రతినిధులు

సాక్షి, అనకాపల్లి: విశాఖలో నిర్వహించనున్న 'యోగాంధ్ర' కార్యక్రమానికి వెళ్లే బస్సు రూట్‌లో గురువారం కలెక్టర్ విజయ కృష్ణన్ ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ఆమె పల్లె వెలుగు బస్సులో ప్రయాణించి రూట్‌ను పరిశీలించారు. అనకాపల్లి నుంచి ఎన్ఏడీ కూడలి, అడవివరం, హనుమంతువాక, మధురవాడ, ఐటీ సెజ్‌ల మీదుగా ఎస్.వి.పి.లా కాలేజ్, గ్రీన్ డేల్ స్కూల్, వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌లలో ఏర్పాటు చేసే మూడు వేదికల వద్దకు వెళ్లి ఏర్పాట్లపై సమీక్షించారు. బస్సు రూట్లను, దిగే ప్రాంతాలను, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. జిల్లా నుంచి వెళ్లే 1200 బస్సుల కోసం మధురవాడ, పీఎం పాలెం, ఐటీ సెజ్ వద్ద ఉన్న పనోరమ హిల్ ఏరియా, పోలమాంబ దేవాలయం ఏరియా, వీఎంఆర్‌డీఏ లేఅవుట్ సైట్, ఎంవీవీ లేఅవుట్ సైట్, ఇండస్ టవర్స్ లేఅవుట్, హిల్ టాప్ ఏరియా, ఆదాని హిల్ ఏరియా.. ఇలా 8 చోట్ల పార్కింగ్ స్థలాలు కేటాయించారు. జిల్లాకు 37 కంపార్ట్‌మెంట్లు కేటాయించి, ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో 1300 మంది ఉండే విధంగా ఏర్పాటు చేశారు.

ఫార్మా వ్యర్థాలతో ముప్పుపై ఫిర్యాదు



ఫైనాన్స్ మేనేజర్ కృష్ణవేణికి వినతిపత్రం అందిస్తున్న పూడిమడక మత్స్యకారులు

అచ్యుతాపురం రూరల్: సెజ్, ఫార్మా పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు నేరుగా ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి విడిచిపెడుతుండడంతో అరుదైన మత్స్య సంపదను కోల్పోతున్నామని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం అచ్యుతాపురం ఏపీఐఐసీ జెడ్ఎం కార్యాలయంలోని ఫైనాన్స్ మేనేజర్ కృష్ణవేణికి పూడిమడక మత్స్యకారులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాత్రి సమయాల్లో సెజ్ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ రసాయన జలాలు సెజ్ సీసీ కాలువల ద్వారా ఉప్పుటేరులో కలుస్తున్నాయన్నారు. దీంతో ఉప్పుటేరులో పెద్ద ఎత్తున మత్స్య సంపద మృత్యువాత పడుతోందని చెప్పారు. రసాయనాల కారణంగా పాగురు కొండలు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణ ప్రదేశంలో వేలాది చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు వాపోయారు. ఉప్పుటేరుపై ఆధారపడి జీవిస్తున్న వందలాది మంది మత్స్యకారులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. ఉప్పు తయారీ కార్మికులు సైతం ఉపాధి కోల్పోయారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూడిమడక మత్స్యకారుల ఆరోగ్యానికి, ఆర్థికాభివృద్ధికి నష్టం కలిగిస్తున్న సెజ్ పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించకుంటే భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా మత్స్యకార సంఘం నాయకులు చోడిపల్లి అప్పారావు, వైస్ ఎంపీపీ వాసుపల్లి పద్మ శ్రీనివాసరావు, కో–ఆప్టడ్ ఎంపీటీసీ చేపల శ్రీరాములు, అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొన్నారు.

దేశంలో విప్లవాత్మక మార్పులు



ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

అనకాపల్లి: ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలనలో దేశంలో అనేక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. స్థానిక గవరపాలెం అంబేడ్కర్ నగర్‌లో పార్టీ వార్డు ఇన్‌చార్జి మారిశెట్టి భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే వ్యవస్థలో కీలకమైన మార్పులు తీసుకొచ్చామన్నారు. దొంగనోట్లు నిర్మూలించేందుకు డిజిటల్ లావాదేవీలు వంటి సంస్కరణలు అమలు చేశారన్నారు. అనంతరం వికసిత్ భారత్ 2047 ప్రతిజ్ఞ చేసి, ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.అప్పారావు, జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగమణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉడా రమేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ బి.నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు కె.సన్యాసిరావు పాల్గొన్నారు.

విభిన్నంగా ఆలోచించేవారు ఏ రంగంలోనైనా రాణిస్తారు. ధైర్యంగా చొరవతో అడుగేసేవారు విజయతీరానికి చేరుతారు. రసాయన ఎరువులకు స్వస్తి పలుకుతూ ప్రకృతి వ్యవసాయ బాటలో నడుస్తూ లాభాలు ఆర్జించవచ్చు. సేంద్రియ పద్ధతుల్లో డ్రాగన్ ఫ్రూట్ పండ్లు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఎ.కోడూరుకు చెందిన రైతు లెక్కల కోటేశ్వరరావు.

సేంద్రియ బాటలో డ్రాగన్ సిరులు



- ఎ.కోడూరులో ఐదెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు
- స్థానికంగానే మంచి డిమాండ్
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు కోటేశ్వరరావు



కె.కోటపాడు: కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో ఐదెకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్ సాగును రైతు కోటేశ్వరరావు మూడేళ్ల క్రితం ప్రారంభించారు. మొదటి ఏడాది సాగు ప్రారంభంలో దుక్కులు, డ్రాగన్ మొక్కల కొనుగోలు, సిమెంట్ స్తంభాలు, వైర్లుతో పాటు ఇతర కూలి ఖర్చులకు ఎకరానికి రూ.6 లక్షల నుంచి రూ.7లక్షల వరకూ ఖర్చు అవుతుంది. 8 నుంచి 12 నెలల మధ్య పంట చేతికొస్తుంది. ప్రతి ఏడాది డ్రాగన్ ఫ్రూట్ పంట దిగుబడి జూన్‌లో ప్రారంభమై నవంబర్ వరకూ ఉంటుంది. మొదటి ఏడాది 5 ఎకరాల్లోను 3 టన్నుల దిగుబడి, రెండో ఏడాది 15 టన్నుల దిగుబడి వచ్చిందని రైతు కోటేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది చెట్లకు డ్రాగన్ ఫ్రూట్ కాపు బాగుండడంతో 35 టన్నుల వరకూ దిగుబడి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కలకు జీవామృతంతో ఊపిరి

కోటేశ్వరరావు సేంద్రియ విధానంలో డ్రాగన్ ఫ్రూట్‌ను సాగు చేస్తున్నారు. దీంతో మార్కెట్‌లో మంచి డిమాండ్, మద్దతు ధర పలుకుతోంది. ఆవు పేడ, కోడి గెత్తంను డ్రాగన్ ఫ్రూట్ మొక్కల మొదళ్ల వద్ద వేయడంతో మొక్కలు ఆరోగ్యంగా ఎదుగుతున్నాయి. గోమూత్రం, బెల్లం, శనగపిండి, ఆవు పేడ, పుట్టమన్నును వారం రోజుల పాటు నిల్వ ఉంచి తయారు చేసిన జీవామృతంను డ్రిప్ విధానం ద్వారా డ్రాగన్ ఫ్రూట్ మొక్కలకు అందిస్తున్నారు. తద్వారా పంటకు తెగుళ్ల బెడద తప్పింది. రసాయన ఎరువులకయ్యే ఖర్చు చాలా వరకు తగ్గింది.



పంటకు అందించేందుకు సిద్ధంగా ఉన్న సేంద్రియ ఎరువు



ఎ.కోడూరులో సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ పంట

స్థానికంగానే అమ్మకాలు

డ్రాగన్ ఫ్రూట్ ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా దొరుకుతుంది. ఎక్కడ పండించినా పట్టణాలకు తెచ్చి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఈ పంట ఎ.కోడూరులో సాగు చేయడంతో పాటు సేంద్రియ విధానంలో పండించడంతో కొనుగోలు చేసేందుకు స్థానిక ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌ను తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్న నేపథ్యంలో మండలానికి చెందిన ప్రజలతో పాటు సమీప మండలాలైన దేవరాపల్లి, వేపాడకు చెందిన వారు వచ్చి ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

ఆసక్తి ఉంటే సాగు సూచనలు



డ్రాగన్ ఫ్రూట్ పంటను సేంద్రియ విధానంలో చేపడుతున్నా. సేంద్రియ ఎరువులు, జీవామృతం వాడడం వల్ల పంట దిగుబడి బాగుంది. పెద్ద సంఖ్యలో కొనుగోలుదారులు పొలం వద్దకే వస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంట సాగుపై ఆసక్తి ఉన్న వారికి సలహాలు, సూచనలు చేస్తా. సాగు ప్రారంభంలో పెట్టుబడి ఖర్చులు ఎక్కువగా అయినా.. తదుపరి దిగుబడి ప్రారంభమైతే తరువాత ఏడాది నుంచి ఆదాయం పొందవచ్చును. కిలో డ్రాగన్‌ఫ్రూట్ రూ.150కు విక్రయిస్తున్నా. ఫోన్ నంబర్ 98663 81817లో సంప్రదిస్తే సాగుకు అవసరమైన సూచనలు చేస్తా.

–లెక్కల కోటేశ్వరరావు, సాగు రైతు, ఎ.కోడూరు

బదిలీల రగడ..

రోడ్డెక్కిన హెడ్‌నర్సులు

- వైద్య ఆరోగ్య శాఖలో పైరవీల పర్వం
- నిబంధనలకు పాతరేస్తూ బదిలీలు
- 58 ఏళ్ల వయసు వారికి ఏజెన్సీలో పోస్టింగ్
- అన్యాయమంటున్న నర్సులు

మహారాణిపేట(విశాఖ): వైద్య ఆరోగ్యశాఖలో పలు కేటగిరీల ఉద్యోగుల బదిలీలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, ఆంధ్రా మెడికల్ కాలేజీల్లో పలు కేటగిరీల్లో రెండు రోజుల కిందట ప్రారంభమైన బదిలీల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ముఖ్యంగా నర్సులు, ఏఎన్ఎంలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల్లో తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కొంతమందికి మేలు చేసే ఉద్దేశంతో అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను బుట్టదాఖలు చేసి, ఏకపక్షంగా వ్యవహరించారని పలువురు ఆరోపిస్తున్నారు. పేరుకు నిబంధనలు ఉన్నప్పటికీ.. వాటిలో ఒక్కటి కూడా బదిలీ ప్రక్రియలో అమలు చేయలేదని, భారీ మొత్తంలో ముడుపులు తీసుకుని కావాల్సిన వారికి కావాల్సిన చోట పోస్టింగ్‌లు ఇచ్చారని సమాచారం.

అవినీతి కేసులో ఉన్నవారికి అందలం

సీనియర్ అసిస్టెంట్ బదిలీల్లో భాగంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసులో పట్టుబడిన ఉద్యోగికి కీలకమైన పోస్టింగ్ ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. గతంలో ఆర్డీ కార్యాలయంలో పని చేస్తున్నప్పుడు ఏసీబీకి పట్టుబడిన ఆ ఉద్యోగికి ప్రభుత్వ విక్టోరియా ఆసుపత్రిలో పోస్టింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఏసీబీ కేసుల్లో చిక్కుకున్న వారికి ప్రాధాన్యం లేని(లూప్‌లైన్) పోస్టింగ్‌లు ఇవ్వాలి. కానీ ఇక్కడ నగర పరిధిలోనే పోస్టింగ్ ఇవ్వడం వెనుక కూటమి ఎమ్మెల్యే కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. అదేవిధంగా ఇతర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి అనకాపల్లి డీఎంహెచ్‌వో కార్యాలయంలో పోస్టింగ్ కేటాయించారు. మార్గదర్శకాల ప్రకారం బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. వైద్య ఆరోగ్య శాఖలో మొదటి నుంచి అన్నీ తేడా వ్యవహారాలే కాబట్టి.. అధికారులు చేతివాటం ప్రదర్శించారని ఆరోపణలు వస్తున్నాయి.

కొరవడిన పారదర్శకత

హెడ్‌నర్సుల బదిలీల కౌన్సెలింగ్‌లో పారదర్శకత లోపించిందని పలు ప్రభుత్వ ఆసుపత్రుల హెడ్‌నర్సులు కేజీహెచ్ వద్ద గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. వెంటనే కౌన్సెలింగ్‌ను రీకాల్ చేసి ఆఫ్‌లైన్‌లో తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు హెడ్ నర్సులు మాట్లాడారు. 'ప్రభుత్వ నిబంధనల ప్రకారం 50 ఏళ్లు దాటిన ఉద్యోగులను ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేయకూడదు. కానీ 58 ఏళ్లు దాటిన సుమారు 55 మంది మహిళలను విశాఖపట్నం నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. తమలో చాలామందికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని, పదవీ విరమణకు కూడా తక్కువ సమయం ఉందని, అయినప్పటికీ తమ విజ్ఞప్తిని అధికారులు పరిగణలోకి తీసుకోలేదని వాపోయారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ అధికారి ఏకపక్షంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారని, కౌన్సెలింగ్ సమయంలో తమ అభిప్రాయాలు చెప్పకుండా కంప్యూటర్‌ను మ్యూట్ చేశారని ఆరోపించారు. తమకు నచ్చినట్లే బదిలీలు చేస్తామని, వెంటనే ఆమోదపత్రాలు తీసుకోవాలని తమపై ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. అలాగే పైఅధికారుల ఒత్తిళ్లకు తలొగ్గి తక్కువ వయసు ఉన్నవారికి నచ్చిన ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారని విమర్శించారు. స్థానికులను కాదని, బయట నుంచి వచ్చిన వారికి నగరంలో ప్రాధాన్యమిచ్చారన్నారు. ఈ వయసులో ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ అయితే ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన చెందారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి డ్యూటీలు వేసినప్పటికీ, వెంటనే బదిలీ అయిన స్థానాల్లో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. జరిగిన కౌన్సెలింగ్‌ను రద్దు చేసి, ఆఫ్‌లైన్‌లో తిరిగి నిర్వహించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నర్సులు

టిప్పర్ లారీకి రూ.80 వేలు జరిమానా



పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

కశింకోట: మండలంలోని బయ్యవరంలో అధిక లోడుతో వెళ్తున్న టిప్పర్ లారీని గుర్తించి రవాణా శాఖ అధికారులకు అప్పగించగా రూ.80 వేలు జరిమానా విధించినట్లు సీఐ అల్లు స్వామినాయుడు గురువారం తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా ఈ లారీని పట్టుకున్నామన్నారు. ఇటీవల జిల్లాలో రహదారులపై అధిక బరువుతో ప్రయాణిస్తున్న లారీలు పలు ప్రమాదాలకు కారణమవుతున్న నేపథ్యంలో రహదారి భద్రత, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వాహనదారులు చట్టాలకు, నిబంధనలకు లోబడి వాహనాలను నడపాలన్నారు. తనిఖీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చీడిగుమ్మల శివాలయంలో చోరీ



శివాలయంలో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

గొలుగొండ: చీడిగుమ్మల శివాలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి చొరబడి ఆలయ గేట్లు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. హుండీలు ధ్వంసం చేసి నగదు పట్టుకుపోయారని ఆలయ ధర్మకర్త, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు గొలుగొండ పోలీసులకు గురువారం ఫిర్యాదులు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలయంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా.. ఇద్దరు యువకులు ఈ చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు.

4 గంటలకు రాకుంటే రూ.500 ఫైన్

- డ్వాక్రా మహిళలకు లీడర్ల హెచ్చరికలు
- సోషల్ మీడియాలో మెసేజ్‌లు వైరల్

విశాఖ సిటీ : 'యోగాంధ్ర కార్యక్రమానికి తెల్లవారు నాలుగు గంటలకే రావాలి.. లేదంటే రూ.500 ఫైన్ కట్టాలి'.. అంటూ డ్వాక్రా మహిళల మొబైల్ ఫోన్లకు వస్తున్న మెసేజ్‌లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. యోగాంధ్ర వేడుకలను విజయవంతం చేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. విశాఖ నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి లక్షల సంఖ్యలో జనాలను తరలించడానికి ఆపసోపాలు పడుతున్నారు. తెల్లవారుజాము 5 గంటలకే జనాలు కంపార్ట్‌మెంట్లలోకి చేర్చాలని గట్టి నిర్ణయంతో ఉన్నారు. అంటే వీరిని అర్ధరాత్రి 2, 3 గంటల సమయంలోనే బస్సులు, ఇతర వాహనాల్లో జనాలను బీచ్‌రోడ్డుకు తీసుకురావాల్సి ఉంటుంది. కానీ ఆ సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చే అవకాశాలు ఉంటాయన్న అనుమానం అధికారులను వేధిస్తోంది. దీంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో డ్వాక్రా మహిళలను తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారి ఆదేశాల మేరకు గ్రూపు లీడర్లు మహిళలకు మెసేజ్‌లు చేస్తున్నారు.

బెదిరింపుల మెసేజ్‌లు

యోగాంధ్ర కార్యక్రమానికి 5 లక్షల మందిని సమీకరించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో జనసమీకరణ బాధ్యతలను యూసీడీ, డ్వామా, ఎడ్యుకేషన్, ఇలా పలు శాఖలకు అప్పగించారు. అలాగే సచివాలయ సిబ్బందికి ప్రజల రిజిస్ట్రేషన్ బాధ్యతలను అప్పగించారు. వారికి ఇచ్చిన లక్ష్యాల మేరకు సిబ్బంది తెలిసిన వారితో పాటు సచివాలయాలకు వచ్చే వారి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేపడుతున్నారు. ఇదిలా ఉంటే అర్ధరాత్రి సమయంలో జనాలు యోగాంధ్రకు వస్తారా? అన్న సందేశాలు అందరిలోను వ్యక్తమవుతున్నాయి. ఈ తరుణంలో డ్వాక్రా మహిళలను తీసుకురావాలని అధికారులు డ్వాక్రా గ్రూపు లీడర్లకు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు డ్వాక్రా మహిళలకు వ్యక్తిగతంగా మెసేజ్‌లు చేస్తున్నారు. 21వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలని, లేదంటూ రూ.500 ఫైన్ కట్టాలని ఆ మెసేజ్‌లో పేర్కొంటున్నారు. ఇప్పుడు ఈ మెసేజ్‌లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఒకవైపు యోగాసనాలు వేసే వారినే తీసుకురావాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారుల సమీక్షలో తేల్చి చెప్పారు. కానీ డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలను సైతం ఈ యోగాంధ్ర కార్యక్రమాన్ని తరలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రాని వారికి ఫైన్ల పేరుతో బెదిరింపు మేసేజ్‌లు చేయడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి తరలింపులో తలనొప్పులు

యోగాంధ్ర కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమం ఉదయం 6.30 గంటలకు ప్రారంభమవుతుంది. కానీ జనాలను ఉదయం 5.30 గంటలకే కంపార్ట్‌మెంట్లలోకి తరలించాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. అయితే విశాఖవాసులు ఉదయం 4 గంటలకు బయలుదేరితే 5 గంటలకు బీచ్ రోడ్డుకు చేరుకునే అవకాశం ఉంటుంది. అనకాపల్లి, అల్లూరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి జనాలను అర్ధరాత్రి 2 గంటలకు బస్సులు, ఇతర వాహనాల్లో తరలించాలని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అర్ధరాత్రి 2 గంటలకు బస్సులు బయలుదేరాలంటే.. గంట, రెండు గంటలకు ముందే వీరు ఆయా బస్సుల ప్రాంతాలకు చేరుకోవాల్సి ఉంటుంది. రాత్రే వీరిని పికప్ చేసుకోవాల్సి వస్తే రాత్రి భోజన ఏర్పాట్లు చేయాల్సి వస్తుంది. అలాగే వీరికి బాత్‌రూమ్, ఇతర సదుపాయాలు కల్పించడం కూడా అంత తేలికైన విషయం కాదు. ప్రతి వంద మందికి ఒక టాయిలెట్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఆ టాయిలెట్లు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో రాలేనట్లు తెలుస్తోంది. వాటిని ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26 కిలోమీటర్ల మధ్యలో బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఇవి యోగాకు వచ్చే వారికి సరిపోవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

యలమంచిలి రూరల్: స్థానిక గురజాడ అప్పారావు అటానమస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు గురువారం విడుదల చేశారు. వివిధ డిగ్రీ కోర్సులకు సంబంధించి మొత్తం 300 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా.. 192 మంది ఉత్తీర్ణులైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ మీడియాకు తెలిపారు. 64 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పరీక్షల నియంత్రణ అధికారి రామారావు తెలిపారు. బీఎస్సీలో 58.38 శాతం, బీకాంలో 91.11 శాతం, బీఏలో 72.97 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పోలిరెడ్డి, అధ్యాపకులు జగ్గారావు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం



దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



శతకంపట్టు కనకదుర్గమ్మవారు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణాన్ని ఆలయ ప్రధానార్చకులు బోగారపు వెంకటరమణ, ఉదయగిరి చంద్రశేఖర్ గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మల్లేశ్వరస్వామి తరపున మళ్లరాజు లహరి దంపతులు, దుర్గాదేవి అమ్మవారి తరపున బొడ్డేడ బాలసుబ్రహ్మణ్యం శ్రీలక్ష్మి దంపతులు కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పెండ్లి కూతురుగా అమ్మవారి ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు ముస్తాబు చేశారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణాన్ని తిలకించి, ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమశెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గౌరీపరమేశ్వరుల కమిటీ సభ్యులు, మరిడిమాంబ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి



శ్రీచైతన్య జూనియర్ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి, తదితరులు

అనకాపల్లి: కార్పొరేట్ విద్యా సంస్థలు చేస్తున్న దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి డిమాండ్ చేశారు. స్థానిక రావు గోపాలరావు కళాక్షేత్రం రహదారిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీకి అంతులేకుండా పోయిందన్నారు. లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యా సంస్థల్లో ప్రత్యేకంగా ఓ స్టోర్‌ను ఏర్పాటు చేసి, పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు యూనిఫాం విక్రయాలు చేపడుతున్నారని చెప్పారు. ఆయా సంస్థల్లో కనీస వసతులు లేకపోయినా భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. విద్యను వ్యాపారంగా చూస్తున్న శ్రీచైతన్య కాలేజీపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు జగదీష్ సింహాద్రి, రాజు సంతోష్, యశ్వంత్ పాల్గొన్నారు.

లా సెట్‌లో 'టాప్' లేపారు..

అనకాపల్లి విద్యార్థినికి ఫస్ట్ ర్యాంక్

అనకాపల్లి టౌన్ /ఎంవీపీకాలనీ/కంచరపాలెం: లాసెట్ 2025 ఫలితాల్లో ఉమ్మడి విశాఖ జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అనకాపల్లి శారదానగర్‌కు చెందిన వేముల వెంకట శివసాయి భార్గవి లాసెట్ (బీఎల్ మూడేళ్ల కోర్సు)లో రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఆమె ఇటీవలే ఆంధ్ర యూనివర్సిటీలో బీటెక్ పూర్తిచేసింది. లాసెట్ పరీక్షలలో 120 మార్కులకు గాను 115 సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమె తండ్రి నర్సింగరావు విశ్రాంత ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్. తల్లి సుబ్బలక్ష్మి గృహిణి. ముదునూరి రామ్ తేజ్ వర్మ రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించగా, గొర్లె శ్రావ్య నాలుగో ర్యాంకుతో సత్తా చాటారు.

లక్ష్యం ప్రొఫెషనల్ కెరీర్



విశాఖలోని లాసన్స్ బే కాలనీకి చెందిన ముదునూరి రామ్ తేజ్ వర్మ లాసెట్–2025లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించి ప్రతిభ చూపాడు. ప్రొఫెషనల్ ఉద్యోగం చేయాలనే లక్ష్యంతోనే తాను లాసెట్ రాసినట్లు రామ్ తేజ్ వర్మ తెలిపారు. అతని తండ్రి ముదునూరి విజయ్‌కుమార్ రాజు నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్‌గా విధులు నిర్వర్తించి ఇటీవలే పదవీ విరమణ చేశారు. తల్లి ధనలక్ష్మి గృహిణి. రామ్ తేజ్ వర్మ 2013లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎంటెక్ సివిల్ ఇంజినీరింగ్ (స్ట్రక్చరల్ ఇంజినీరింగ్) పూర్తి చేశారు. అనంతరం రెండేళ్లు సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. హైదరాబాద్‌లోని గురునానక్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. మూడున్నరేళ్లపాటు తిరుపతిలోని కేఎస్ఆర్ ఐఏఎస్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు సివిల్స్ కోచింగ్ ఇచ్చారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యతో పాటు ప్రొఫెషనల్ కెరీర్ కూడా ఉండాలన్న అభిప్రాయంతోనే లాసెట్ పరీక్షకు సిద్ధమయ్యానని రామ్ తేజ్ వర్మ వివరించారు. ఈ విషయంలో హైకోర్టు న్యాయవాది, తన పిన్ని శ్రీదేవి తనకు ప్రోత్సాహం అందించారని పేర్కొన్నారు. లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావడం తనకు చాలా ఆనందంగా ఉందని, న్యాయవాదిగా సేవలు అందించాలన్న తన లక్ష్యానికి ఈ ర్యాంకు స్ఫూర్తినిచ్చిందన్నారు. ఈ ర్యాంకు ద్వారా ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో లా కోర్సులో చేరతానని తెలిపారు. అయితే ఎన్‌క్యాట్ (జాతీయ స్థాయి లా ఎంట్రన్స్ టెస్ట్) కూడా రాస్తానని చెప్పారు. అందులో మంచి ర్యాంకు వస్తే హైదరాబాద్ నల్సార్ లా కళాశాల లేదా బెంగళూరులోని నేషనల్ లా కళాశాలలో న్యాయ విద్యను అభ్యసిస్తానని రామ్ తేజ్ వర్మ పేర్కొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి అవుతా



శ్రావ్యను అభినందిస్తున్న తల్లిదండ్రులు చందు, పార్వతి

తాటిచెట్లపాలెం, కైలాసపురానికి చెందిన గొర్లె శ్రావ్య లాసెట్ 2025 ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు సాధించారు. గురువారం విడుదలైన ఫలితాల్లో శ్రావ్య 107 మార్కులతో నాలుగో స్థానంలో నిలిచారు. జూలై 13న జరగనున్న జేసీజే (జూనియర్ సివిల్ జడ్జి) ఎంట్రన్స్ పరీక్ష రాసి జూనియర్ సివిల్ జడ్జి కావాలనే లక్ష్యంతో ఆమె శ్రమిస్తున్నారు. శ్రావ్య తండ్రి గొర్లె చంద్రరావు విశాఖ పోర్ట్ ట్రస్ట్‌లో పనిచేస్తూ.. నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్‌కు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. శ్రావ్య అక్క గొర్లె సింధు క్యాట్ రాసి ఐఐఎం ఉదయపూర్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. ప్రస్తుతం బెంగళూరులోని జేపీ మోర్గాన్‌లో ఉద్యోగం చేస్తున్నారు. తల్లి గొర్లె పార్వతి గృహిణిగా ఉంటూ, పిల్లల ఉన్నత చదువులను దగ్గరుండి చూసుకుంటున్నారు.

క్లుప్తంగా

కథల పోటీల్లో విజేతలకు బహుమతులు



కథల పోటీల్లో విజేతలతో ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్: తెలుగు భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో వాట్సాప్ సమూహంలో నిర్వహించిన కథల పోటీల్లో విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో 'పెంపుడు జంతువులు' మాట్లాడితే అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో మొత్తం 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో ప్రథమ బహుమతులు సంజన, నివాస్ గెలుపొందారు. వీరికి తెలుగు భాష పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె. రామ్మోహన్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శిష్ట తమ్మిరాజు, జి రంగ బాబు, గాయత్రి, అమరజ్యోతి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు ఘన సత్కారం



హెచ్‌ఎం సురేష్‌కుమార్ సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీ అయిన హెచ్‌ఎం బి. సురేష్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం ఘనంగా సత్కరించారు. దుశ్శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి సన్మానించారు. నూతన హెచ్‌ఎం ఎ. తాయారు, ఉపాధ్యాయులు సుజాత, వి. శ్రీనివాసరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కశింకోటలో వాహనాలు తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

కశింకోట: స్థానిక పోలీసు స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం ఎస్‌ఐ లక్ష్మణరావు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహన చోదకులకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో సీటు బెల్టు పెట్టుకోవాలని, ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 60 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	------	------
రెండో రకం	3,690	3,690
మూడవ రకం	3,550	3,700

అనకాపల్లి సినిమాలు

రాజా	: భైరవం
సత్యనారాయణ స్క్రీన్-1	: డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్-2	: 8 వసంతాలు
పర్తిసాయి	: కుబేర
షిర్డీసాయి	: సితార జమీన్ పర్
వెంకటేశ్వర	: పాప
శ్రీ సత్య	: కట్టప్ప జడ్జిమెంట్
రామచంద్ర	: హంటర్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 69 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 18 యూనిట్లు, బీ పాజిటివ్ -26, ఓ పాజిటివ్ -28, ఏబీ పాజిటివ్ -7 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్(9703619706)ను ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 361 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 316 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

సర్కారు బడికి మళ్లీ కష్టాలు



హైస్కూల్ వరండాలో పదో తరగతి విద్యార్థులు

అనకాపల్లి: సర్కారు బడులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో అధునాతన హంగులతో కళకళలాడిన వీటికి ఇప్పుడు మౌలిక వసతులు కల్పించక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పుతున్న కూటమి ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయి. ఇప్పటికీ నాడు-నేడు నిధులతో అభివృద్ధి చేసిన పనులు కనిపిస్తున్నాయి.

వసతులు కల్పించకుండానే విద్యార్థుల తరలింపు..

అనకాపల్లి మండలం తారకరామారావు కాలనీలో ఎలిమెంటరీ స్కూల్లో హైస్కూల్ నిర్వహించేవారు. దీనివల్ల ఎలిమెంటరీ స్కూల్, హైస్కూల్, అంగన్‌వాడీ స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై విద్యాశాఖ అధికారులు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఎన్టీఆర్ కాలనీ సమీపంలో నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. అక్కడ నాడు-నేడు కింద రూ.1.52 కోట్లు మంజూరు చేయగా, రూ.70 లక్షలతో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐదు తరగతి గదులను నిర్మించారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో మౌలిక వసతుల కల్పన పనులు ఆగిపోయాయి. ఇంతలో కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని కల్పించకుండానే ఈ ఏడాది మార్చి 17న హైస్కూల్ భవనాలను ప్రారంభించారు. నూతన తరగతి గదుల్లోకి విద్యార్థులను మార్పు చేశారు.



వైఎస్సార్‌సీపీ పాలనలో నిర్మించిన ఎన్టీఆర్ కాలనీ హైస్కూల్

- వైఎస్సార్‌సీపీ హయాంలో అధునాతన భవనాలతో హైస్కూలు
- సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిలిచిన మిగిలిన పనులు
- నేడు మౌలిక వసతులు కల్పించని కూటమి ప్రభుత్వం
- ఆగమేఘాల మీద ఎలిమెంటరీ స్కూలు నుంచి తరలింపు
- ఎన్టీఆర్ కాలనీలో విద్యార్థులకు తప్పని పాట్లు

హైస్కూలులో సమస్యలు ఇవే..

- ఎన్టీఆర్ కాలనీలో నాలుగెకరాల హైస్కూల్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో రాత్రిళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది.
- స్కూల్లో 6 నుంచి 10వ తరగతి వరకూ 300 మంది విద్యార్థులు ఉన్నారు.
- **300 మంది విద్యార్థులకు 5 తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. కొంతమంది విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆరుబయట బోధించాల్సి వస్తోంది. అదనంగా మరో 7 తరగతి గదులు ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగుతాయి.**
- ఇక్కడ హైస్కూల్‌లో అనకాపల్లి మండలం గొలగాం, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి పంచాయతీతో పాటు పరవాడ మండలం మడకపాలెం గ్రామం విద్యార్థులు చదువుతున్నారు.
- 180 మంది విద్యార్థినులకు 5 బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు ఉన్నాయి. ఒక బాత్‌రూమ్‌ను ఉపాధ్యాయినులు వినియోగిస్తున్నారు. మిగిలిన విద్యార్థులు కొండ ప్రాంతానికి వెళ్లే పరిస్థితి ఏర్పడుతోంది.
- వర్షం పడితే స్కూల్ క్రీడా మైదానం ఎర్రమట్టి బురద దర్శనమిస్తుంది. కాలు తీసి వేయాలంటే జారుతుంది. ప్రధాన రహదారి నుంచి హైస్కూల్‌కు అర కిలోమీటరు మేర ఎర్రమట్టిలో రావాల్సిందే.
- స్కూల్‌కు వచ్చే తోవలో చెరువు ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- వంటలు చేసేందుకు భవనం లేకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు రూ.15 వేలతో చిన్నపాటి షెడ్ నిర్మించుకున్నారు. రాత్రి సమయంలో వంట సామగ్రి చోరీకి గురవుతున్నట్లు వాపోతున్నారు.
- వర్షాలు, గాలులు వీచే సమయంలో వర్షపు నీరు షెడ్‌లోకి వచ్చి నిత్యావసర సరుకులు పాడవుతున్నాయి.
- స్కూలుకు వచ్చే రహదారిలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి.

ఎర్రమట్టిలో విద్యార్థుల సైకిల్ పార్కింగ్ స్థలం





హైస్కూల్‌కు వెళ్లే రహదారి



మధ్యాహ్న భోజన పథకం వంటశాల



హైస్కూల్‌కు వెళ్లే రహదారిలో చిన్నపాటి చెరువు



ఎర్రమట్టితో క్రీడా మైదానం

కొత్త హైస్కూల్ బాగుంది



హైస్కూల్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడితే ఎర్రటి బురదలో నుంచి స్కూల్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఆటల స్థలాన్ని చదును చేయాలి. కొండ ప్రాంతంలో హైస్కూల్ కొత్తగా నిర్మించారు. బాగుంది. గాలి, వెలుతురు వస్తోంది. విద్యార్థులకు సైకిల్ స్టాండ్, బాత్ రూమ్స్ ఏర్పాటు చేయాలి.

– సుందరపు మధుగణేష్, పదో తరగతి విద్యార్థి, గోపాలపురం గ్రామం

మాకు బాత్‌రూమ్‌లు లేవు



హైస్కూల్ నుంచి ఇంటికి మూడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. రోజుకు ఏడు కిలోమీటర్లు సైకిల్ తొక్కుతున్నాను. సైకిల్ పార్కింగ్ చేసేందుకు షెడ్ లేకపోవడంతో ఎండావానకు ఆరుబయట ఉంచడం వల్ల పాడైపోతుంది. విద్యార్థినులకు బాత్‌రూమ్స్ ఉన్నాయి. మాకు లేకపోవడంతో దగ్గరలో కొండ వద్దకు వెళ్లాల్సి వస్తోంది.

– తూదిన వెంకటజయకృష్ణ, పదో తరగతి విద్యార్థి, మారేడుపూడి పంచాయతీ, బీసీ కాలనీ, అనకాపల్లి మండలం

ఆరు బయటే చదువు



తరగతి గదులు చాలకపోవడంతో ఆరుబయట నేలపై చదువుకుంటున్నాం. సరైన బోర్డులు లేకుండా పోయాయి. వర్షం పడితే పాఠశాలకు వెళ్లే తోవలో చిన్నపాటి చెరువు ఉంది. ప్రధాన రహదారి నుంచి స్కూల్ వెళ్లే మార్గంలో చెరువు పక్క నుంచి వెళ్లాలి. వర్షం కురిసే సమయంలో నీరుచేరి భయమేస్తోంది. భోజనాలు ఎర్రమట్టిలో కూర్చోని తినాల్సి వస్తోంది.

– ఈగల చైతన్య, పదో తరగతి విద్యార్థి, గన్నువానిపాలెం, మారేడుపూడి పంచాయతీ

నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేయాలి



జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జోసెఫ్

అనకాపల్లి: కూటమి నేతలకు ఏడాది పాలనలో ప్రతిపక్షాల నాయకులను విమర్శించడంతోనే సరిపోయిందని, ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని విశాఖ ఉమ్మడి జిల్లా కో ఆప్షన్ సభ్యుడు, సాంఘిక సంక్షేమ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పి.జోసెఫ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో రాష్ట్రంలో గొయ్యిలు లేని రోడ్లు అభివృద్ధి చేస్తామని చెప్పి ఏడాది పూర్తయినా అనకాపల్లి నుంచి చోడవరం వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రూ.34 వేల కోట్లతో రహదారులు అభివృద్ధి చేస్తున్నామని ప్రకటనలకే మిగిలిందన్నారు. కరోనా మహమ్మారితో ప్రపంచ దేశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో అప్పటి సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రానికి ఆదాయం లేకపోయినప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వలంటీర్లకు నెలకు రూ.5 వేలు ఇస్తే, ఏమి సరిపోతుందని హేళన చేసి, కూటమి అధికారం చేపట్టిన వెంటనే నెలకు రూ.10వేలు గౌరవవేతనం ఇస్తామని, ఉన్న ఉద్యోగాన్ని తీసేశారని దుయ్యబట్టారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు 50 సంవత్సరాలకే వృద్ధాప్య పింఛన్ ఇస్తామని మోసం చేశారన్నారు. ఈ ఏడాదిలో నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.1.50 వేల కోట్లు అప్పులు తీసుకుని ఏమి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే వరకూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తుందన్నారు.

మలేరియాపై అవగాహన తప్పనిసరి



మలేరియాపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: మలేరియాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, రానున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటెడ్ అధికారి బి.మంగమ్మ తెలిపారు. మండలంలో సీహెచ్‌ఎన్.అగ్రహారంలో మలేరియా మాసోత్సవాలను పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమకాటు వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని కోరారు. దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు ప్రత్యేక జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం రేపు

అనకాపల్లి: స్థానిక న్యూకాలనీలో అష్టాదశ శక్తిపీఠాల అమ్మవారి ఆలయం వార్షికోత్సవం ఈ నెల 21న వైభవంగా నిర్వహిస్తున్నట్లు అర్చకుడు విశ్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో 18 అమ్మవార్లకు ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు, వివరాలకు 9490480492 సంప్రదించాలని కోరారు.

తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కిలోకి రూ.10 తగ్గింది. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.30కి తగ్గింది. ఉల్లి, బంగాళదుంప ఇదే ధర ఉండగా, వంకాయ, బెండకాయ, క్యాబేజి రూ.40, క్యారెట్, బీట్‌రూట్ రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన ఐ.డి.బి.ఐ. బ్యాంక్ లిమిటెడ్ రిటైల్ అసెట్స్ సెంటర్, విశాఖపట్నం వారి నుండి ఈ క్రింద తెలియపరచిన షెడ్యూల్ దాఖల ఆస్తిని తనకిచ్చి ఋణము పొందదలచిన శ్రీ ఆదారి నూక చంద్రశేఖర్ గారు సదరు ఇంటి ఆస్తి యజమానురాలు శ్రీమతి కొణతాల రాధా భాయి గారి నుండి క్రయ పురోణీ పొందియున్నారు అనియు సదరు ఇంటి ఆస్తి యజమానులకు సంబంధించిన షెడ్యూల్ దాఖల ఆస్తికి సంబంధించిన ఆస్తి లింకు క్రయ దస్తావేజు నెం: 3659/2007 తేదీ: 01/06/2007, శ్రీమతి బొడ్డేడ చిట్టమ్మ తదితరులచే శ్రీ కొణతాల సీతారామ పేరున రిజిష్టర్ చేయబడిన క్రయ దస్తావేజు కనబడుట లేదనియు, వెతికినా దొరకలేదనియు తెలియపరిచారు.

కావున సదరు తనఖా చేయు ఆస్తి విషయమై ఎవరికైనా ఎటువంటి క్లయిములు, తనఖాలు, కోర్టు తగాదాలు ఉన్న యెడల ఈ ప్రకటన చేయబడిన తేదీ నుండి ఏడు దినములలోగా ఈ క్రింద తెలియపరచిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియపరచవలెను. లేని యెడల తదుపరి జరుగు ఎట్టి పరిణామములకు నా క్లయింట్ బాధ్యులు కారని తెలియపరచడమైనది.

ఆస్తి వివరము

అనకాపల్లి జిల్లా, అనకాపల్లి సబ్‌రి॥, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేరిన అనకాపల్లి టౌన్ ఓల్డ్ పోర్ట్ వార్డు, బ్లాక్ నెం:2, సర్వే నెం: 73, 74ర్లు పార్ట్‌లో చేరిన ప్లాట్ నెం: 668లో శిథిలావస్థలో ఉన్న పెంకుటింటిని నేలమట్టం చేసి ఖాళీగా ఉన్న స్థల విస్తీర్ణం 166.66 చదరపు గజాలలో ఆస్తికి **హద్దులు: తూర్పు:** మున్సిపల్ రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం: 668 పార్ట్, **దక్షిణం:** మున్సిపల్ లేబిట్ రోడ్డు, **ఉత్తరం:** బుద్ధ శివాజీ గారి ఆస్తి.

మండు రామకృష్ణరాజు & మోతి లక్ష్మీ సాహు, న్యాయవాదులు
డోర్ నెం: 43-18-4, వెంకటరాజు నగర్,
టి.ఎస్.ఎన్. కాలనీ, విశాఖపట్నం -530016.
సెల్: 9441046814, ల్యాండ్‌లైన్: 0891-2503514

ఉత్సాహంగా యోగాంధ్ర శిక్షణ



కశింకోట బాలికల పాఠశాలలో యోగా ఆంగ్ల అక్షర రూపంలో విద్యార్థులు

కశింకోట: స్థానిక బాలికల ప్రాథమిక పాఠశాలలో యోగాంధ్రలో భాగంగా గురువారం విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా ఆంగ్ల అక్షర రూపంలో వేసిన విన్యాసాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం నేమాల రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాళ్లపాలెం జెడ్పీ హైస్కూలులో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు యోగాసనాలు, సూర్య నమస్కారాల పట్ల అవగాహన కలిగించారు. హెచ్‌ఎ ప్రసాదరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తాళ్లపాలెం కల్యాణ మండపంలో యోగాసనాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. యోగా ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో పలు ఆసనాలు వేశారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



తాళ్లపాలెం హైస్కూలులో యోగా శిక్షణ



తాళ్లపాలెం కల్యాణ మండపంలో యోగాసనాలు

విద్యుత్ స్తంభానికి మంటలు



కె.కోటపాడు : కె.కోటపాడు పశువైద్య కేంద్రం, సీహెచ్‌సీ ప్రహరీ సమీపంలో గల విద్యుత్ స్తంభానికి గురువారం మంటలు వ్యాపించారు. ఈ స్తంభాన్ని అనుకొని పిచ్చి మొక్కలు విస్తారంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే సమీప సీహెచ్‌సీలో గల వ్యర్థాలను, స్థానికులు చెత్తను వేస్తుంటారు. ఈ చెత్తకు ఉదయాన్ని నిప్పంటించడంతో విద్యుత్ స్తంభానికి మంట వ్యాపించింది. సమీపంలో ఉన్న సబ్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందడంతో విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేసారు. దీంతో స్థానికులు మంటలను నీటితో అదుపు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో గల విద్యుత్ స్తంభానికి ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో పలువురు ఆందోళన చెందారు. వెంటనే విద్యుత్ ప్రసారాన్ని నిలిపివేసి మంటలు అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పిందని పలువురు ఊపిరి పీల్చుకున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



రోడ్డు డివైడర్‌పై చిక్కుకున్న లారీ

మాకవరపాలెం: డివైడర్‌ను లారీ ఢీకొట్టిన సంఘటనలో భారీ ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గురువారం ఉదయం నర్సీపట్నం వైపు వెళుతున్న లారీ రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. అటుగా వెళుతూ ఒక్కసారిగా డివైడర్లపైకి దూసుకుపోయి మధ్యలో చిక్కుంది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

7న ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మాడుగుల రూరల్: వచ్చే నెల 7వ తేదీన ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఎం.ఎస్.పి. జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి గాటీలు మాదిగ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఎం. కోటపాడులో ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, జిల్లా ఎంఆర్‌పీఎస్ ఎంయస్‌పి ఎంఈపి ఇన్‌చార్జి పోసపల్లి వెంకట్రావు మాదిగ సూచనల మేరకు వచ్చే నెల 7 వ తేదీన ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని ఆయన కోరారు. మంద కృష్ణ మాదిగ కృషి వల్ల ఏబీసీ వర్గీకరణ అమలు కావడం, కృష్ణమాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాగంగా ఎంఎస్పీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కడిత అప్పారావు, ఎంఆర్‌పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులుగా ఎలుసూరి అప్పారావు, మహిళా అధ్యక్షురాలిగా రాజ్యలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.



ఎం. కోటపాడులో మాట్లాడుతున్న ఎలుసూరి గాటీలు

కె.కోటపాడు : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని జూలై 7న కె.కోటపాడులో నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు అన్నారు. చౌడువాడలో గల ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి మండలంలో అన్ని గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో మాదిగ మహిళా నాయకురాలు అనిత, అనకాపల్లి రాజు, జీవరత్నం పాల్గొన్నారు.



చౌడువాడలో మాట్లాడుతున్న జిల్లా ప్రచార కార్యదర్శి శ్రీనివాసరావు

రూ.లక్ష విరాళం

మునగపాక: మండలంలోని పాటిపల్లి-మంగళవరపుపేట పరిధిలో నిర్మిస్తున్న గంగాలమ్మ గుడికి దాతలు తమవంతు సాయం అందజేస్తున్నారు. మంగళవరపుపేటకు చెందిన సరిసా నాగబాబు, -వీరలక్ష్మి దంపతుల కుమారులు సూరి అప్పారావు, శ్రీను రూ.లక్ష విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు.